క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గణపర్తిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మునగపాక: మండలంలోని గణపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1987–88 టెన్త్ బ్యాచ్‌కు చెందిన వీరంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు. నాటి తీపి జ్ఞాపకాలను ఒక్కసారిగా గుర్తుకు తెచ్చుకున్నారు. ఒకరికొకరు పలకరించుకొని ఉత్సాహంగా గడిపారు. దీనిలో భాగంగా కశింకోట మండలం పల్లపు సోమవరం సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావును సత్కరించారు. మధ్యాహ్నం అంతా సహపంక్తి భోజనాలు చేశారు.

పక్కాగా కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు


సర్వేను పరిశీలిస్తున్న జిల్లా లెప్రసీ అధికారి ప్రియ ధాత్రి

మునగపాక: కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే పక్కాగా చేయాలని జిల్లా లెప్రసీ అధికారి ప్రియ ధాత్రి తెలిపారు. మునగపాకలో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ప్రక్రియను ఆమె ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఇంటిని నిశితంగా పరిశీలించి స్పర్శలేని వారిని గుర్తించాలన్నారు. ఎవరికైనా స్పర్శ లేని మచ్చలు ఉంటే, వారిని సమీపంలోని వైద్యుల వద్దకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవళిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు


వాలీబాల్ పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత సూర్యనారాయణ

మునగపాక: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ జన్మదినం సందర్భంగా స్థానిక నందీశ్వర కళా ప్రాంగణంలో ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నేత నరాలశెట్టి సూర్యనారాయణ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. రూ.15 వేలు, రూ.6 వేలు, రూ.3 వేలు చొప్పున ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, నిర్వాహకులు ఆడారి కాశీబాబు, పెంటకోట శ్రీను(నెట్), ఆడారి రమణబాబు, పిన్నమరాజు రవీంద్రరాజు, ఆడారి లక్ష్మణరావు, కాండ్రేగుల రాజు పాల్గొన్నారు.

దైవచింతన అలవరచుకోవాలి


వాడ్రాపల్లిలో ప్రభుతో భక్తులు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి పెదరామాలయాన్ని ఆదివారం ఆనందపురంలోని హరేకృష్ణ మూవ్‌మెంట్‌కు చెందిన శ్యామ్ మాధవ్ దాస్ ప్రభు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన్ను స్థానిక భక్తులు ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రభు మాట్లాడుతూ ఇక్కడి ఆలయంలో రామ నామం యజ్ఞంలా కొనసాగడం అభినందనీయమన్నారు. ప్రజలు భక్తిభావాలను అలవరుచుకోవాలన్నారు. గ్రామాలు సస్యశ్యామలంగా ఉండాలంటే దైవ కార్యక్రమాలు జరగాల్సి ఉందన్నారు. పెతకంశెట్టి రామజోగినాయుడు, సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, బొడ్డేడ సత్యనారాయణ, మళ్ల శేషు, కొణతాల రామకృష్ణ, మళ్ల అప్పలనాయుడు, కొయిలాడ రాంబాబు, యల్లపు పారునాయుడు పాల్గొన్నారు.

మురిసిన మువ్వన్నెల జెండా..

మువ్వన్నెల జెండాల రెపరెపలతో ఊరూవాడా మురిసింది. విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో త్రివర్ణ శోభితమైంది. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ నేతల వేషధారణలో చిన్నారులు అలరించగా, వివిధ శాఖల్లో ఉత్తమ సేవలకుగాను ప్రభుత్వ అధికారులకు పురస్కారాల అందించి సత్కరించారు.


పాయకరావుపేట: జెడ్పీహెచ్ స్కూల్లో జెండా ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ లంక సూరిబాబు


యలమంచిలి రూరల్: మున్సిపల్ కార్యాలయం వద్ద వేడుకల్లో అధికారులు, పాలకవర్గ సభ్యులు


కోటవురట్లలో గౌరవ వందనం సమర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


కోటవురట్ల: కె.వెంకటాపురంలో చిన్నారులకు బహుమతులు అందిస్తున్న బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్


నక్కపల్లి: జాతీయ నేత విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


నక్కపల్లి: పోలీస్ స్టేషన్లో పతాకావిష్కరణ చేస్తున్న సీఐ కుమార స్వామి

యలమంచిలి రూరల్: పట్టణంలో గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెలవు దినమైనప్పటికీ స్కూళ్లకు ఉపాధ్యాయులు, విద్యార్థులు రావడంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కొండలరావు, ఎంపీడీవో కొండలరావు తమ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. జాతీయ పతాకానికి గౌరవ వందనం చేశారు. అంబేడ్కర్ వంటి మహనీయులు చేసిన సేవలను స్మరించుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బోదెపు గోవింద్, ఎంపీటీసీలు, మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, వైస్ చైర్మన్లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఇందిరా కాలనీ హైస్కూల్‌లో జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ జి.సత్యనారాయణ జెండాను ఆవిష్కరించి, విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. పీఎల్‌పురం గ్రామ సచివాలయం వద్ద ఈవోపీఆర్డీ సిహెచ్ చంద్రశేఖర్, సర్పంచ్ పడాల సోమన్నదొర, పోలీసు స్టేషన్ వద్ద సీఐ జి.అప్పన్న, శాఖా గ్రంథాలయం వద్ద గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి గణతంత్ర వేడుక నిర్వహించారు. పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద, మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వద్ద అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్. భానుమూర్తి పాల్గొని, ఎన్‌సీసీ విద్యార్థుల కవాతును పర్యవేక్షించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థికి సహనం, ఏకాగ్రత, నిశిత పరిశీలన, కఠిన శ్రమ వంటి లక్షణాలను కలిగి ఉండాలని వివరించారు. చిన్నారులు పాడిన దేశభక్తి గీతాలు విద్యార్థులలో జాతీయ భావాలను నింపాయి. కార్యక్రమంలో డైరెక్టర్ హెచ్ఆర్ డాక్టరు వి.వి.ఎ.బి. బంగార్రాజు, స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎ.ఆర్.కె. రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలో 76వ గణతంత్ర వేడుకలు ఆదివారం వాడవాడలా ఘనంగా జరిగాయి. తహసీల్దార్ రేగులపాటి నర్సింహమూర్తి, ఎంపీడీవో డీ సీతారామరాజు, సీఐ కుమార స్వామి, విభీషణ్ రావు, వ్యవసాయ అధికారి ఉమాప్రసాద్ తమ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలు ఎగురవేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రత్నకుమారి, ఏరియా ఆస్పత్రి వద్ద అభివృద్ధి కమిటీ సభ్యుడు కొప్పిశెట్టి వెంకటేష్, కేజీబీవీ వద్ద ప్రత్యేకాధికారి సలీమా, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎంలు రాణిలలిత, వేమగిరి నూకరాజు తదితరులు పతాకావిష్కరణ చేశారు. విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ నేతల జయరత్న కుమారి, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఆర్ఐ కన్నబాబు, ఎస్ఐ సన్నిబాబు ఎంఈవో కుంచం నరేష్, ఉప సర్పంచ్ వీసం రాజు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలో గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకం సగౌరవంగా రెపరెపలాడింది. మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి, వైస్ ఎంపీపీ ఆర్ఎస్ సీతారామరాజు గౌరవ వందనం సమర్పించారు. జెడ్పీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజున భారతదేశ ఔన్నత్యాన్ని చాటుతూ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డపాటి అనిల్‌కుమార్, ఎంపీటీసీలు పుట్రేవు వెంకట సూర్యారావు, వంగలపూడి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు సిద్దాబత్తుల సత్యనారాయణ, ఎంఈవో రామారావు, మండల జేఈ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు. కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం షేక్ అల్లావుద్దీన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాళ్ల రత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండలంలో గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ జె.రమేష్‌బాబు జెండా ఆవిష్కరణ చేశారు. పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేసి అలరించారు.

అచ్యుతాపురం: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల వద్ద గణతంత్ర వేడుకలు ఆదివారం నిర్వహించారు. మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఒకరికొకరు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


పాయకరావుపేట: జెండాను ఆవిష్కరించిన గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు


పాయకరావుపేట: పీఎల్‌పురంలో జెండాను ఆవిష్కరించిన ఈవోపీఆర్డీ చంద్రశేఖర్


పాయకరావుపేట: చిన్నారులకు పెన్నులు, పెన్సిళ్లు అందిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ


ఎస్.రాయవరంలో జెండా ఆవిష్కరణ చేసిన తహసీల్దార్ రమేష్‌బాబు


పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో ఎన్‌సీసీ విద్యార్థుల కవాతు


అచ్యుతాపురం మండలంలోని దివ్యాంగుల ఆశ్రమం వద్ద వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో బి.జయమాధురి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యాలయ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. రాంబిల్లి హైస్కూల్, కేజీబీవీ, తహసీల్దారు కార్యాలయం, పోలీస్ స్టేషన్ వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పాఠశాలల్లో దేశభక్తి గీతాలు ఆలపించి దేశ నాయకుల వేషధారణలతో విద్యార్థులు అలరించారు. ఈ వేడుకల్లో జెడ్పీటీసీ నాగరాజు, సీఐ సిహెచ్ నరసింగరావు, ఎస్ఐ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు జి. శ్రీనుబాబు, అధికారులు పాల్గొన్నారు.

మునగపాక: మండల వ్యాప్తంగా గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. మునగపాక పోలీసు స్టేషన్ వద్ద ఎస్ఐ పి.ప్రసాదరావు పతాకావిష్కరణ గావించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ఎం.ఉషారాణి జెండా ఎగురవేశారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు. రెవెన్యూ కార్యాలయం వద్ద డీటీ శేషుబాబు పతాకావిష్కరణ గావించారు. రీ–సర్వే డీటీ పడాల్, ఉద్యోగులు పాల్గొన్నారు. తోటాడ సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి సూరిశెట్టి శ్రీలక్ష్మి పతాకావిష్కరణ గావించి వేడుకల ప్రాముఖ్యతను వివరించారు.


నక్కపల్లి: పతాకావిష్కరణ చేస్తున్న తహసీల్దార్ అంబేడ్కర్


రాంబిల్లిలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో జయమాధురి


మునగపాక పోలీసు స్టేషన్ ఆవరణలో జెండా ఆవిష్కరిస్తున్న ఎస్ఐ ప్రసాదరావు


మునగపాక: మండల పరిషత్ కార్యాలయం వద్ద పతాకావిష్కరణ చేస్తున్న ఎంపీడీవో ఉషారాణి


మునగపాక: తోటాడ సచివాలయం వద్ద పతాకావిష్కరణ చేస్తున్న కార్యదర్శి శ్రీలక్ష్మి


యలమంచిలి రూరల్: జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో కొండలరావు

అధికారులకు రిపబ్లిక్ డే పురస్కారాలు


కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహీన్‌సిన్హాల నుంచి అవార్డు అందుకుంటున్న నక్కపల్లి ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంఈవో నరేష్, కోటవురట్ల ఎస్సై రమేష్

ఎక్సైజ్ సీఐకు రాష్ట్ర స్థాయి అవార్డు

పాయకరావుపేట: గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ జి.శ్రీనివాసరావు ఉత్తమ సేవా పురస్కారం పొందారు. అమరావతిలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ కమిషనర్ నుంచి ఆయన ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.


అమరావతిలో ఎక్సైజ్ కమిషనర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు

నక్కపల్లి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు మండల స్థాయి అధికారులు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. తమ శాఖల్లో చేసిన సేవలకు గుర్తింపుగా ఎంపీడీవో డి. సీతారామరాజు, తహసీల్దార్ ఆర్. నర్సింహమూర్తి, ఎంఈవో కుంచం నరేష్‌లకు పురస్కారాలను అనకాపల్లిలో కలెక్టర్ విజయకృష్ణన్ అందజేశారు. వీరిని అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

హిందూ ధర్మ ప్రచార శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న ఓం నమోనారాయణాయః సమూహం

యలమంచిలి రూరల్: పట్టణంలో హిందూ ధర్మ ప్రచార శోభాయాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. పిఠాపురానికి చెందిన కంచపు రామలింగేశ్వరరావు స్థాపించిన ఓం నమో నారాయణాయః వాట్సాప్ సమూహం సభ్యులు వంద మంది ఈ శోభాయాత్రలో పాల్గొన్నారు. ప్రజల్లో హిందూ ధర్మంపై మరింతగా అవగాహన కల్పించాలనే ఆశయంతో చేపట్టిన శోభాయాత్రకు స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. శోభాయాత్ర పొడవునా నమోనారాయణాయః మంత్రోచ్ఛరణ మార్మోగింది. అనంతరం శేషు గెడ్డ శివాలయం సమీపంలో ఓ విడిదింట్లో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. రోజంతా సంకీర్తనతో భజన నిర్వహించారు. అన్యమత ప్రచారం ఎక్కువగా జరగడంతో హిందూ ధర్మ పరిరక్షణకు ఇలాంటి ఆత్మీయ కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకుడు రామలింగేశ్వరరావు తెలిపారు. పీ సాయికృష్ణ, ఆయుర్వేద వైద్యుడు ఏవీఎస్ఎస్ఎన్ మూర్తి, తేజ హోం ఫుడ్స్ యజమాని లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలి


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలోని గౌతమపఠన మందిరం స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉన్న పుస్తకాలను వినియోగించుకొని విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, పఠన మందిరం సభ్యులు మారిశెట్టి అప్పారావు, దాడి సూరిబాబు, ఆడారి లక్ష్మణరావు, వెలగా శ్రీనివాసరావు, ఆడారి పరశురామ్, దాడి శ్రీరామమూర్తి, కుంది సూర్యనారాయణ, దాడి అప్పలనాయుడు, బూడిద రామారావు, ఆడారి కాశీబాబు, మోహనరావు పాల్గొన్నారు.

పేద విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ


పేద విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న దేవదాయ శాఖ అధికారులు

యలమంచిలి రూరల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 30 మంది పేద విద్యార్థినులకు దేవదాయ శాఖ అధికారులు ఆదివారం సైకిళ్లను ఉచితంగా అందజేశారు. దేవదాయ శాఖ కమిషనరు ఆదేశాల మేరకు ఏటా మాదిరిగానే లోకల్ ఫండ్ సత్రం నిధులతో వీటిని అందించినట్టు స్థానిక దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి తులం సాంబశివరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి, వైస్ ఎంపీపీ రాజాన శేషు, బొద్దపు శ్రీను, ఆడారి ఆదిమూర్తి, ఆడారి రమణబాబు, యలమంచిలి జెడ్పీ బాలికోన్నత, రైల్వే స్టేషన్ రోడ్డు, కొత్తపేట జెడ్పీ స్కూళ్ల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

500 మంది దంపతులతో సహస్ర మోదక హోమం

అనకాపల్లి: మానవుని జీవితంలో సమస్యలు వస్తాయని, ఎదురుతిరిగి జీవించినప్పుడు ఆనందంగా ఉంటారని మైసూర్ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లిలోని చింతామణి గణపతి దత్తక్షేత్రంలో ఆదివారం స్వామీజీ చింతామణి రాగ సాగర, సహస్ర మోదక హోమం, శ్రీచక్రపూజలు నిర్వహించారు. ప్రతి వ్యక్తి భక్తి భావనతో మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని చెప్పారు. సహస్ర మోదక హోమంలో 500 మంది దంపతులు పాల్గొన్నారు. అంతకు ముందు దత్తక్షేత్రంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మైసూర్ దత్త విజయానంద తీర్థ స్వామీజీ, దత్తక్షేత్ర నిర్వాహకులు ఆంజనేయరాజు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


దత్తక్షేత్రంలో సహస్ర మోదక హోమంలో పాల్గొన్న భక్తులు

ధరలు తగ్గించాలని సంతకాల సేకరణ

కశింకోట: ఐద్వా ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి నివేదించడానికి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. కశింకోట వీధుల్లో తిరిగి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి. వరలక్ష్మి మాట్లాడుతూ ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలన్నారు. కోటా ద్వారా ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు కందిపప్పు సహా 14 రకాల నిత్యావసర వస్తువులను రేషన్ డిపోల ద్వారా రాయితీపై అందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్టు మీటర్లు అమర్చరాదని, విద్యుత్ చార్జీల పెంపునకు కారణమవుతున్న అక్రమ ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు తగ్గించాలన్నారు. అర్హులకు రేషన్‌కార్డు, పింఛన్ మంజూరు చేయాలన్నారు.